క్లుప్తంగా

స్టడీ మెటీరియల్ అందజేత



స్టడీ మెటీరియల్ అందుకున్న విద్యార్థులు

వేటపాలెం: పదోతరగతి పరీక్షల్లో విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని హెచ్ఎం భవనం భద్రిరెడ్డి అన్నారు. మండల పరిధిలోని అక్కాయిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఆధ్వర్యంలో పదోతరగతి విద్యార్థులకు ఎస్ఎస్‌సీ స్టడీ మెటీరియల్ ఉచితంగా సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులచే తయారు చేసి ముద్రించిన సీసీఈ మోడల్ టెస్టు పేపర్లను విద్యార్థులకు ఉచితంగా అందించామన్నారు. 14 ఏళ్లగా విద్యార్థులకు స్టడీ మెటీరియల్ ఉచితంగా అందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కే శ్రీనివాసరావు, ఎం జయరావు, జీ శ్రీనివాసరెడ్డి, బీ అనూరాధ, ఎల్ అంజమ్మ, బీ బాలసుబ్రహ్మణ్యం, ఎం కమురున్నీసా బేగం, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రైవేటు వాహనాలకు అడ్డాగా ఎమ్మార్వో ఆఫీస్



ప్రభుత్వ కార్యాలయాల సముదాయం

చీరాల టౌన్: చీరాల ప్రభుత్వ కార్యాలయాల సముదాయ ప్రాంతం ప్రైవేటు వాహనాల పార్కింగ్‌కు కేంద్రంగా మారింది. నిత్యం వందలాది మంది చీరాల పట్టణం, గ్రామ పంచాయతీలకు చెందిన ప్రజలు వచ్చే తహశీల్దార్, మండల పరిషత్, ఉపఖజానా, హౌసింగ్, ఆర్ అండ్ బీ కార్యాలయాలు ఉన్న ప్రదేశం కాస్తా వివిధ రకాలు భూముల రిజిస్ట్రేషన్లు, షాపింగ్‌లకు చీరాల వచ్చిన వారి వాహనాలతో నిండిపోతుంది. తహశీల్దార్ కార్యాలయాన్ని ఆనుకుని ఉన్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి రిజిస్ట్రేషన్లు, కూరగాయల మార్కెట్‌లో కొనుగోలుకు వచ్చిన కార్లు, ఆటోలు, ద్విచక్ర వాహనాలను కార్యాలయం ముందు నిలుపుదల చేయడంతో వివిధ ప్రభుత్వ కార్యాలయాలకు వస్తున్న ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండల అధికారులు స్పందించి చీరాల ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలో ప్రైవేటు వాహనాల నిలుపుదల లేకుండా చేసి ప్రజల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు



వేటపాలెం/చీరాల: జాతీయ రహదారి-215 బైపాస్ రోడ్డులో ప్రమాదాల నివారణ కోసం చర్యలు చేపట్టామని చీరాల రూరల్ సీఐ శేషగిరిరావు తెలిపారు. అందులో భాగంగా సోమవారం బైపాస్ రోడ్డు కూడళ్లలో వేగ నిరోధకాల ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్పీ ఆదేశాల మేరకు మండల పరిధిలోని బైపాస్ రోడ్డు కూడలైన అక్కాయిపాలెం, చల్లారెడ్డిపాలెం, వేటపాలెం, పందిళ్లపల్లి, ఎర్రగేటు వద్ద గల కూడళ్లలో వాహనాలు వేగాన్ని నిరోధించడాని ఇసుక నింపిన డ్రమ్ములు ఏర్పాటు చేశామన్నారు. దీంతో పాటు కూడళ్లలో ప్రత్యేకంగా బోర్డులు ఏర్పాటు చేశామని తెలిపారు. వాహనదారులు, ప్రజలు ప్రమాదాల నివారణకు సహకరించాలని కోరారు. వాహనాలు అతివేగంగా వెళ్లకుండా సురక్షిత ప్రయాణం చేయాలని సూచించారు. వీరి వెంట ఎస్సై ఎం వెంకటేశ్వర్లు, సిబ్బంది ఉన్నారు.

విద్యార్థినులకు సైకిళ్ల పంపిణీ



అద్దంకి: ప్రకాశం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలోని పేద విదార్థినులకు సోమవారం విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ సైకిళ్లను పంపిణీ చేశారు. ఈ సైకిళ్లను నెదర్లాండ్, రోటరీ క్లబ్, మరికొందరు దాతలతోపాటు, మంత్రి తన సొంత నిధులును వెచ్చించి 8,9 తరగతుల విద్యార్థినులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థులు మిగిలిన వారితో పోటీపడాలన్నారు. రవాణా సదుపాయం లేక విద్య ఆగకూడదనే ఉద్దేశంతో సైకిళ్లను పంపిణీ చేసినట్లు చెప్పారు. నియోజకవర్గంలోని 40 ప్రభుత్వపాఠశాలల్లోని బాలికలకు రూ.5 కోట్ల వ్యయంతో ఏడాదిలో 10 వేల సైకిళ్లను ఉంచితంగా పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో అసిస్ట్ డైరక్టర్ జాష్టి రంగారావు, రోటరీ క్లబ్ నెదర్లాండ్స్ ప్రతినిధులు, లియోజ్వాగ్ మేకర్, కిస్ వార్డెన్, బెర్గ్, కోన్ వెన్సర్‌తో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అంతా వట్టి గ్యాసే !

- గ్యాస్ సబ్సిడీ రాక బ్యాంకుల చుట్టూ తిరుగుతున్న లబ్ధిదారులు
- వేటపాలెంలో 80 శాతం మందికి పడని సబ్సిడీ
- ఏడాదికి మూడు సిలిండర్లు ఇస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం
- తీరా చూస్తే .. ఇచ్చింది ఒకటే
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు



వేటపాలెం:

ఏడు నెల కూటమిపాలనలో అంతా గ్యాసే కొట్టే మాటలే తప్పా చేసి చూపించిన దాఖలాలు లేవని ప్రజలు బాహాటంగానే విమర్శిస్తున్నారు. పాలన అంతా సిలిండర్ ఉందే తప్ప.. అందులో గ్యాస్ లేదని ఎద్దేవా చేస్తున్నారు. ఏడాదికి మూడు సిలిండ్లరు ఇస్తాం అని చెప్పిన ప్రభుత్వం తీరా చూసే సరికి ఈ ఏడాది మార్చి వరకు ఒకటే ఇచ్చిందని ప్రతిపక్ష పార్టీలు ఆరోపిస్తున్నాయి. అయితే ఏ కొందరికో డబ్బులు చేసి మేం అందరికీ ఇస్తున్నాం అని గొప్పలు చెప్పుకుంటోంది. గతేడాది 2024 జూన్‌లో అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం ఈ ఏడాది మార్చి వరకే ఒక సిలిండర్ మాత్రమే ఇచ్చి మూడు సిలిండర్‌లు ఇచ్చాం అన్నట్లుగా కలరింగ్ ఇస్తోంది. ఇదంతా తెలిసిన లబ్ధిదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలో మహిళలకు ఉచిత వంట గ్యాస్ పథకం హామీ ఆదిలోనే హంసపాదుగా మారింది. మహిళలకు కానుకగా దీపావళి పండగ నుంచి ఉచితంగా గ్యాస్ ఇస్తున్నట్లు ప్రకటించారు. అయితే దీపావళి పోయే.. సంక్రాంతి పోయే ఇంత వరకు గ్యాస్ సబ్సిడీ నగదు పడిన దాఖలాలు లేవు. నిజానికి ఇప్పటికే రెండు సిలిండర్లు ఇవ్వాలి. కాని 2024 నవంబర్ నెలాఖరు వరకూ మొదటి సిలిండర్‌కు డబ్బులు కూడా జమ కాలేదు. ఏదో కంటితుడుపుగా అయితే కొంత మంది లబ్ధిదారులకు గ్యాస్ డబ్బులు జమ చేసి చేతులు దులుపుకున్నారు. గ్యాస్ సిలిండర్లు బుక్ చేసుకున్నా నేటికి సబ్సిడీ రాలేదు. ఇప్పటికి రెండు నెలలు గడిచిపోయినా అతీగతీ లేదు. ఎప్పుడు డబ్బులు వేస్తారో సెల్ ఫోన్‌లో మెసేజ్ ఎప్పుడు వస్తుందేమోనని చూసుకుంటున్నారు. డబ్బులు జమకాక పోవడం వల్ల నిరాశగా మహిళలు కూటమి పాలకులపై విమర్శనాస్త్రాలు గుప్పిస్తున్నారు. గ్రామాల్లో ఎక్కడ చూసినా ఇదే పరిస్థితి నెలకొంది.

22 వేల గ్యాస్ కనెక్షన్లు..

వేటపాలెం మండల పరిధిలో రెండు ఇండియన్ గ్యాస్ ఏజెన్సీలు ఉన్నాయి. ఈ రెండింటి పరిధిలో 22 వేల గ్యాస్ కనెక్షన్‌లు ఉన్నాయి. అందులో ఉజ్వల, పీఏయూవై, దీపం, జనరల్ కనెక్షన్‌లు ఉన్నాయి. ఏజెన్సీ నిర్వాహకులు మండల పరిధిలోని గ్యాస్ వినియోగదారులకు నిరంతరం ఇళ్లకు గ్యాస్ సరఫరా చేస్తున్నారు. 2024 సాధారణ ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం ఏడాదికి మూడు సిలిండర్లు ఉచితంగా ఇస్తామని ప్రకటించారు. ఈ మేరకు ప్రకటించిన వారం రోజులు కొంత మంది లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో అక్కడక్కడా జమచేశారు. మిగతా వారికి ఇంత రకూ డబ్బులు ఖాతాల్లో వేయడం లేదు.

48 గంటల హామీ అమలు ఏమైంది..

వంటగ్యాస్ వినియోగదారులకు గ్యాస్ అందించిన 48 గంటల్లో సబ్సిడీ డబ్బులు బ్యాంక్ ఖాతాల్లో వేస్తామని కూటమి ప్రభుత్వం ప్రకటించింది. అయితే ఇంతవరకూ గ్యాస్ తెచ్చుకున్న 80 శాతం మందికి డబ్బులు పడలేదని, సబ్సిడీ డబ్బుల కోసం బ్యాంక్‌ల చుట్టూ పాస్‌బుక్ చేతబట్టుకుని తిరగాల్సి వస్తోందని మహిళలు మండిపడుతున్నారు. దీనికి నిధులు ఎప్పుడు మంజూరు చేస్తారో ఏమి తెలియని దుస్థితి. పాలకులు మాత్రం అందరికీ ఉచితంగా గ్యాస్ సిలిండర్లు ఇచ్చినట్లు ప్రచారం చేస్తుకుంటున్నారు. గ్యాస్ డెలివరీ చేసిన 48 గంటల్లోపు సబ్సిడీ డబ్బులు లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమవుతాయని చెప్పారు. కాని నవంబర్‌లోపు గ్యాస్ బుక్ చేసుకున్న వారికి రెండు నెలలు గడుస్తున్నా వేలాది మంది లబ్ధిదారులకు డబ్బులు జమ కాలేదు.

న్నారు. అక్కడికి వెళ్తే బ్యాంక్ ఈ-కేవైసీ చేయించాలటున్నారని, ఈ-కేవైసీ చేయించామని చెప్తే గ్యాస్ ఆఫీసుకు వెళ్లి చెప్పమని అంటున్నారు. దీంతో ఉచిత గ్యాస్ పథకం కూటమి ప్రభుత్వ మాయగా ప్రజలు విమర్శిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి కొరవడడంతో ఇలా ప్రజలకు ఇబ్బందులు పెడుతున్నారని మహిళా సంఘాలు విమర్శిస్తున్నాయి.

సబ్సిడీ కోసం ఎవరిని అడగాలి..

ఉచిత గ్యాస్ పథకానికి సంబంధించి సమస్యలు ఉంటే ఎవరికి చెప్పుకోవాలో తెలియక లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారు. సబ్సిడీ డబ్బులు ఎందుకు పడలేదని ఏజెన్సీ నిర్వాహకులను ప్రశ్నిస్తే పౌరసరఫరాల కార్యాలయంలో అడగమని అంటు

> **ఇంకా డబ్బులు పడలేదు..**
> మా ఇంటికి వచ్చిన గ్యాస్ కంపెనీ వద్ద డబ్బులు చెల్లించి సిలిండర్ తీసుకున్నాను. మరుసటి రోజు గ్యాస్ డబ్బులు పడతాయని, బ్యాంక్‌లో తీసుకోండని చెప్పారు. కానీ ఇంతవరకు పడలేదు. ఎవరిని అడగాలో తెలియక బ్యాంక్ చుట్టూ తిరుగుతున్నాను. ఎవరిని అడిగినా నాలుగు రోజులు ఆగండి అని చెప్తున్నారు. తక్షణమే కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ అమలు చేయాలి.
> – జీ సుశీల, పందిళ్లపల్లి

ఉత్తమ సేవకులకు ప్రశంస పత్రాలు



జిల్లా కలెక్టర్ చేతుల మీదగా ప్రశంస పత్రాన్ని అందుకుంటున్న ఎక్సైజ్ ఎస్సై బండి శ్రీహరి



ప్రశంస పత్రాన్ని అందుకుంటున్న 108 ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ పులి మధు

చీరాల అర్బన్: ఉత్తమ ప్రతిభ కనబరచిన అధికారులు, సిబ్బందికి ప్రశంసలు మరింత గుర్తింపు వస్తాయి. చీరాల ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లో ఎస్సైగా పనిచేస్తున్న బండి శ్రీహరి గణతంత్ర దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్ జే వెంకటమురళి చేతుల మీదగా ప్రశంస పత్రాన్ని అందుకున్నారు. అలానే 108 ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేస్తున్న పులి మధు కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంస పత్రాన్ని అందుకున్నారు. అలానే చీరాల రూరల్ మండలం రామకృష్ణాపురం సచివాలయంలో సోషల్ వెల్ఫేర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న షేక్ జిల్లా కలెక్టర్ చేతుల మీదగా ప్రశంస పత్రాన్ని అందుకున్నారు.



ప్రశంస పత్రాన్ని అందుకుంటున్న సోషల్ వెల్ఫేర్ అసిస్టెంట్ షేక్ బాజి

సమస్యల పరిష్కారానికే గ్రీవెన్స్ సెల్

కారంచేడు: ప్రజా విజ్ఞప్తులను పరిశీలించి వాటిని సత్వరమే పరిష్కరించేలా ప్రభుత్వం ఏర్పాటు చేసిన గ్రీవెన్స్ సెల్ కార్యక్రమాలు పటిష్ఠంగా పనిచేయాలని ఇన్‌చార్జ్ తహసీల్దార్ అనిత పేర్కొన్నారు. సోమవారం ఆమె మండల రెవెన్యూ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ సెల్‌కు వచ్చిన అధికారులు, ప్రజలతో ఆమె మాట్లాడారు. ప్రజల నుంచి వచ్చిన సమస్యలను సంబంధిత అధికారులు వెంటనే స్పందించి పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నేతాజీ, ఎంఈఓ ఎంవీ సత్యనారాయణ, ఏపీఓ మోహనరావు, సిబ్బంది పాల్గొన్నారు.

చీరాల టౌన్: ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న అర్జీలను నిర్ణీత సమయంలోగా విచారించి పరిష్కరించాలని తహశీల్దార్ కె.గోపీకృష్ణ సూచించారు. సోమవారం తహశీల్దార్ కార్యాలయంలో గ్రామ, పట్టణ రెవెన్యూ సిబ్బందితో స్పందన అర్జీలపై సమావేశం నిర్వహించారు. గ్రామాలు, సచివాలయాల పరిధిలో పెండింగ్‌లో ఉన్న అర్జీలు, పాసు పుస్తకాలు, రెవెన్యూ అజమాయిషీ, నాలా కన్వర్షన్ అర్జీలపై ఆయన మాట్లాడారు. గ్రామాల్లో పనిచేసే వీఆర్వోలు ప్రజలకు అందుబాటులో ఉండటంతో పాటు స్పందన అర్జీలను త్వరగా విచారించాలన్నారు. ప్రజలకు జవాబుదారీతనంగా రెవెన్యూ ఉద్యోగులు పనిచేయాలని, విధుల్లో అలసత్వం వహించిన వారిపై శాఖా పరమైన చర్యలు తప్పవన్నారు. గ్రామాల్లో నీటి తీరువా వసూళ్లు చేయాలన్నారు. రెవెన్యూ ఉద్యోగులు విధులను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో డీటీ డీ అర్జున్, వీఆర్వోలు ఉన్నారు.



మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ తహసీల్దార్ అనిత

ప్రతిభచాటిన బూదవాడ విద్యార్థులు

జే.పంగులూరు: జిల్లా, రాష్ట్రస్థాయిలో జరిగిన పలు పోటీల్లో ప్రతిభచాటి ప్రశంస పత్రాలు అందుకున్నారు బూదవాడ విద్యార్థులు. గతేడాది అక్టోబర్‌లో కేంద్ర ప్రభుత్వ శాఖ 'వీర్‌గాథ-40' ఆన్‌లైన్ పోర్టల్‌లో నిర్వహించిన వ్యాసరచన పోటీలో పాఠశాల పదో తరగతి విద్యార్థి భవనం దివ్య '1857 సిపాయిల తిరుగుబాటు' అనే అంశంపై సమర్పించిన వ్యాసం రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచింది. భవనం దివ్యకు ఆదివారం జిల్లా కేంద్రంలో జరిగిన గణతంత్ర వేడుకలో కలెక్టర్ షీల్డ్‌తో పాటు ప్రశంస పత్రం అందజేశారు. ఇదే పాఠశాల విద్యార్థులు జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా వ్యాసరచనలో నందవరపు యాస్మిన్ (8వ తరగతి) మూడో స్థానం, వక్తృత్వ పోటీలో కొమ్మారెడ్డి జగన్‌మోహన్‌రెడ్డి (9వ తరగతి)కి ద్వితీయ స్థానం సాధించారు. జిల్లా, రాష్ట్ర స్థాయిలో సత్తా చాటిన విద్యార్థులను పాఠశాల హెచ్ఎం నాగరాణి, ఎస్ఎంసీ చైర్మన్ అలవల వీరారెడ్డి, కొమ్మారెడ్డి సుబ్బారెడ్డి, శ్రీనివాసరెడ్డి, బ్రహ్మారెడ్డి, ఉపాధ్యాయులు సోమవారం అభినందించారు.



విద్యార్థి దివ్యకు ప్రశంస పత్రం అందిస్తున్న కలెక్టర్

వ్యాయామ పరికరాల కోసం చెక్ పంపిణీ



చెక్ అందిస్తున్న బ్యాంక్ మేనేజర్

ఇంకొల్లు (చినగంజాం): పాఠశాలలో వ్యాయామ పరికరాల కొనుగోలు కోసం చెక్‌ను స్థానిక కెనరా బ్యాంక్ మేనేజర్ పీ వెంకటరెడ్డి అందజేశారు. సామాజిక బాధ్యతలో భాగంగా ఇంకొల్లు మండలంలోని ఇడుపులపాడు విద్యాపరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్మాణం జరుగుతున్న ఓపెన్ జిమ్ ఎక్విప్‌మెంట్ (ఓపెన్ వ్యాయామ పరికరాలు)కోసం ఆర్థిక సాయాన్ని సోమవారం హెచ్ఎం పిడవర్తి పేరిరెడ్డికి రూ.3 లక్షలు చెక్ అందజేశారు. గ్రామస్తులకు, విద్యార్థులకు వ్యాయామశాల ఉపయోగపడతుందని హెచ్ఎం పేర్కొన్నారు. ఈసందర్భంగా బ్యాంక్ ప్రతినిధులను ఆయన అభినందించారు.

రైతులను మోసగించిన ప్రభుత్వం



నిరసన ర్యాలీ చేస్తున్న రైతు సంఘం నాయకులు

ఇంకొల్లు (చినగంజాం): కేంద్ర ప్రభుత్వం రైతులకిచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని రైతు సంఘం నాయకుడు కందిమళ్ల రామకోటేశ్వరరావు డిమాండ్ చేశారు. ఇంకొల్లులో కిసాన్ మోర్చా పిలుపులో భాగంగా సోమవారం ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ట్రాక్టర్, మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. రైతు సంఘం నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా మోసగిస్తుందని, 13 మాసాలుగా రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నాలు చేయగా నల్ల చట్టాలను రద్దు చేస్తున్నాం అని చెప్పి మళ్లీ ఆచట్టాలను రైతుల్లోకి తీసుకురావటానికి ప్రయత్నం చేస్తుందన్నారు. 70 ఏళ్ల వృద్ధుడు దిల్వాలే 60 రోజుల నుంచి నిరాహారదీక్ష చేయగా న్యాయస్థానాలు సమస్య పరిష్కరించాలని చెప్తున్నా కేంద్రం పట్టించుకోవడం లేదన్నారు. పలు డిమాండ్లతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి నాగండ్ల వెంకట్రావు, గోవిందరాజులు, రైతు సంఘం మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రంగా ఉంటేనే గ్రామాల్లో ఆరోగ్యం



అద్దంకి: సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో

అద్దంకి రూరల్: గ్రామాలు పరిశుభ్రంగా ఉంటేనే అందరూ ఆరోగ్యంగా ఉంటామని ఎంపీడీవో సింగయ్య పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో అధ్యక్షతన పంచాయతీ కార్యదర్శులకు అభివృద్ధి కార్యక్రమాలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్యక్రమాలపై యాక్షన్ ప్లాన్ తయారు చేసి ఇంటింటా చెత్త సేకరణ జరిపించాలన్నారు. మంచినీటి ట్యాంకులను ప్రతినెల రెండుసార్లు శుభ్రపరచాలన్నారు. కార్యక్రమంలో సెక్రటరీలు పాల్గొన్నారు.

చీరాల టౌన్: పారిశుద్ధ్య నిర్మూలన కోసం ప్రత్యేకంగా నిర్వహిస్తున్న కార్యక్రమాలను పకడ్బందీగా నిర్వహించాలని ఎంపీడీవో శివసుబ్రమణ్యం కార్యదర్శులకు సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని గ్రామ పంచాయతీల కార్యదర్శులతో ఎంపీడీవో సమావేశం నిర్వహించి మాట్లాడారు. మాట్లాడుతూ పంచాయతీలకు కేటాయించిన నిధులను సక్రమంగా వినియోగించి రోజువారీగా సమస్యలను లేకుండా చేయాలన్నారు.

కోన రఘుపతిని కలిసిన జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు



రఘుపతికి పుష్పగుచ్ఛం ఇస్తున్న ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు వాసు

చీరాల: రాష్ట్ర మాజీ డిప్యూటి స్పీకర్, వైఎస్సార్ సీపీ బాపట్ల నియోజకవర్గ సమన్వయకర్త కోన రఘుపతిని సోమవారం వైఎస్సార్ సీపీ జిల్లా ఎస్సీసెల్ అధ్యక్షుడు వాసిమళ్ల వాసు బాపట్లలోని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. నియోజకవర్గంలో పార్టీ ఎస్సీ సామాజికవర్గ కమిటీల నియామకాలు, పార్టీ కార్యక్రమాలపై ఆయనతో చర్చించారు. ఆయన వెంట సీనియర్ నాయకులు నారాయణరెడ్డి, గోసాల అశోక్ తదితరులు ఉన్నారు.

పశువైద్య శిబిరాలతో ఉపయోగాలు



మేదరమెట్ల శిబిరంలో పశువుకు వైద్యం చేస్తున్న డాక్టర్ సొదయ్య

బల్లికురవ: వైద్య వసతిలేని మారుమూల గ్రామాల్లో సైతం ఉచిత పశువైద్య శిబిరాలతో పశుపోషకులకు చేయూతనిస్తున్నట్లు వైద్యాధికారులు పీ. మహేశ్వరరావు, ఆర్ పావనకుమారి తెలిపారు. సోమవారం చెన్నుపల్లి ముక్తేశ్వరం గ్రామాల్లో ఉచిత పశువైద్య శిబిరాలు నిర్వహించారు. 73 దూడలకు, 75 గేదెలకు, 200 గొర్రెలకు నట్టల నివారణ మందులు, 43 పశువులకు గర్భకోశ వ్యాధులకు పరీక్షలు చేపట్టారు.

పశుపోషకులు అప్రమత్తంగా ఉండాలి..

కారంచేడు: వాతావరణంలో వచ్చే మార్పులతో సీజనల్‌గా పశువులకు వ్యాపించే వ్యాధుల పట్ల పశుపోషకులు అప్రమత్తంగా వ్యవహరించాలని కారంచేడు పశువైద్యాధికారి డాక్టర్ భాగ్యరాజ్ అన్నారు. సోమవారం ఆయన మండలంలోని జరుబులవారిపాలెం గ్రామంలో నిర్వహించిన పశువైద్య శిబిరంలో గేదెలు, గొర్రెలు, కోళ్ళకు వచ్చే వ్యాధులు, వాటి నివారణ చర్యలపై అవగాహన కల్పించి, వాటికి పరీక్షలు చేసి మందులను ఉచితంగా అందించారు. మొత్తం 47 గేదెలను, 124 గొర్రెలకు వైద్య పరీక్షలు చేసి మందులు అందించారు.

మేదరమెట్ల: మేదరమెట్ల నిర్వహించిన పశువైద్య శిబిరంలో 80 పశువులకు చికిత్సలు, 25 గేదెలకు గర్భకోశవ్యాధులకు చికిత్స, 500 జీవాలకు నట్టల నివారణ ద్రావణం, 150 కోళ్లకు వ్యాక్సిన్ వేశారని డాక్టర్ సొదయ్య తెలిపారు. ఏడీ డాక్టర్ ఎం మోహన్‌రావ శిబిరాన్ని పరిశీలించారు.

సమాజ సేవకులకు రోటరీ పురస్కారాలు



సమాజ సేవకులను సన్మానిస్తున్న రోటరీ సభ్యులు

పర్చూరు (చినగంజాం): నిస్వార్థ సమాజ సేవకులకు రోటరీ క్లబ్ వృత్తి సేవా పురస్కారాలు అందిస్తున్నట్లు పర్చూరు రోటరీ క్లబ్ అధ్యక్షుడు తోకల కృష్ణమోహన్ అన్నారు. రోటరీ సపోర్ట్ 75వ వార్షికోత్సవం సందర్భంగా బ్యాంకింగ్, వైద్యం, పారిశుద్ధ్యం, గ్రామీణ క్రీడల నిర్వాహణ రంగాల్లో సేవ చేసిన ఆరుగురికి వృత్తి సేవా పురస్కారాలు అందించారు. స్థానిక రోటరీ క్లబ్ భవన్‌లో సోమవారం నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో బ్యాంకింగ్ రంగంలో పర్చూరు కెనరా బ్యాంక్ మేనేజర్ వీరేపల్లి రఘువర్మ, యూనియన్ బ్యాంక్ మేనేజర్ ప్రదీప్ కుమార్, సంప్రదాయ క్రీడల నిర్వాహణలో అన్నంబొట్ల వారిపాలేనికి చెందిన గోరంట్ల భాస్కరరావు, వైద్యరంగంలో పోతుకట్ల గ్రామానికి చెందిన ఏఎన్ఎం మేరుగ విజయశ్రీ, నాగులపాలెం గ్రామానికి చెందిన ఆర్ఎంపీ చందలూరి సునీల్‌బాబు, పారిశుద్ధ్య రంగంలో పర్చూరుకు చెందిన తుపాకుల మహాలక్ష్మయ్యకు పురస్కారాలు అందించారు. సన్మాన గ్రహీతలకు శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించి షీల్డుని బహూకరించారు. కార్యక్రమంలో రోటేరియన్‌లు తాళ్ల రాజశేఖర్ రెడ్డి, లంకా రఘురామిరెడ్డి, సహాయ గవర్నర్ తేళ్ల రమేష్ చంద్ర, క్లబ్ కార్యదర్శి కోమటి ఆంజనేయులు, సభ్యులు పంబి సదానందరెడ్డి, కొల్లా నరేంద్ర కుమార్, గడ్డిపాటి శ్రీనివాసరావు, కోట శ్రీనివాసరావు, కోట హరిప్రసాద్, కోడూరి సుబ్రహ్మణ్యాచారి, పాబోలు ఉదయభాస్కర్, నాగబైరు శ్రీనివాసరావు, పోలిశెట్టి చంద్రం, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఇసుక టిప్పర్ స్వాధీనం

వేటపాలెం: అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై ఎం వెంకటేశ్వర్లు సోమవారం తెలిపారు. వేటపాలెం బైపాస్ రోడ్డులో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద ఆదివారం అర్ధరాత్రి తనిఖీలు నిర్వహించారు. అక్రమంగా ఎలాంటి అనుమతులు లేకుండా పందిళ్లపల్లి నుంచి చీరాల వైపు ఇసుక తరలిస్తున్న టిప్పర్‌ను పట్టుకున్నట్లు తెలిపారు. టిప్పర్‌ను పోలీసు స్టేషన్‌కి తరలించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అక్రమంగా ఇసుక తరలించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

దాతల సాయంతో మధ్యాహ్న భోజనం

చీరాల రూరల్: స్థానిక చర్చికాంపౌండ్‌లోని సెయింట్ మార్క్స్ లూథరన్ జూనియర్ కళాశాలలో సోమవారం దాతల సాయంతో విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం ప్రారంభించారు. ముందుగా పాస్టర్ పిల్లి దేవదాసు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి దేవుని వాక్య సందేశం అందించారు. కళాశాల లైబ్రేరియన్ పుల్లగుర జయశీలరావు అధ్యక్షత వహించగా కళాశాల కరస్పాండెంట్ శీలం విద్యాసాగరరావు, ప్రిన్సిపాల్ గారపాటి పుష్పరాజు ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా ప్రేమ నర్సింగ్ హోం అధినేత డాక్టర్ విస్సర్ల బాబు రావు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యాసాగరరావు, జయశీలరావు, పుష్పరాజులు మాట్లాడుతూ బాబురావు కుటుంబంతో పాటు పదేళ్లుగా శ్యాంసుందర్, సుదీప్తి దంపతులు వారి తల్లి దండ్రుల జ్ఞాపకార్థం ఆర్థిక సాయం అందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎ. భగవాన్‌దాస్, సీఐటీయూ బాబురావు, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

90 శాతం హాజరు తప్పనిసరి



చీరాలలో హాజరు పట్టికను పరిశీలిస్తున్న ఆర్డీవో చంద్రశేఖర్ నాయుడు

చీరాల అర్బన్: ప్రభుత్వ పరిధిలోని మున్సిపల్, జిల్లా పరిషత్, ఎయిడెడ్ యాజమాన్యాలలో నడుస్తున్న పాఠశాలలో విద్యార్థుల హాజరు నమోదుపై సోమవారం ఆర్డీవో, ఎంఈఓలు తనిఖీలు నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు చీరాల పట్టణ, రూరల్ ప్రాంతాలలోని పాఠశాలలను ఆర్డీవో టీ చంద్రశేఖర్‌నాయుడు, ఎంఈఓ-1 పి.సుబ్రహ్మణ్యేశ్వరరావులు పాఠశాలలను తనిఖీ చేశారు. పట్టణంలోని ఎస్ఆర్‌పీఎం హైస్కూల్, జాండ్రపేటలోని బీవీ అండ్‌బీఎన్ హైస్కూల్, జాండ్రపేట శివాలయం వద్ద గల ప్రైమరీ పాఠశాలలను వారు తనిఖీ చేశారు. నమోదు అయిన విద్యార్థుల సంఖ్య, రోజువారీగా హాజరవుతున్న వారి వివరాలపై హాజరుపట్టికను పరిశీలించారు. ఈవివరాలను జిల్లా కలెక్టర్‌కు అందిస్తామని అధికారులు తెలిపారు.

అద్దంకి: ప్రతి విద్యార్థి బడికి వచ్చేలా ప్రోత్సహించి వారి హాజరు 90 శాతం ఉండేలా చూడాలని చీరాల డిప్యూటీ డీఈవో శ్రీనివాసరావు అన్నారు. ఆయన సోమవారం మండలంలోని తిమ్మాయపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. పాఠశాలలోని రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. అటెండెన్స్ తక్కువగా ఉన్న విద్యార్థులను గుర్తించి వారి తల్లిదండ్రులతో మాట్లాడాలన్నారు. హాజరు శాతం అధికంగా ఉంటేనే వారికి తల్లికి వందనం పథకం వర్తింస్తుందని తెలియజేయాలని చెప్పారు. కార్యక్రమంలో ఎంఈవోలు గంగాధర్, సుధాకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.